# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 4, అక్టోబర్ 2026


## మెగా జాబ్ మేళాకు
# విశేష స్పందన

■ 300 మందికి ఆఫర్ లెటర్లు

అందజేసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. బీటెక్, పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్హతలు కలిగిన 1,500 మందికి పైగా నిరుద్యోగులు మేళాకు హాజరయ్యారు. 45 కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. ఎంపికైన 300 మందికి సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీశ్‌బాబు ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువతను సాధికారత వైపు నడిపించేందుకు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి మిగతా 2లో..

## ఎస్సార్పీ3 గనిపై కార్మికుడికి ప్రమాదం: హైదరాబాద్‌కు తరలింపు

**నస్పూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ3 గనిపై శనివారం ఉదయం షిఫ్టులో పనిచేస్తున్న దుర్గం శంకర్ అనే సపోర్ట్ మ్యాన్ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. సర్ఫేస్ విభాగంలో పైపులు కట్ చేస్తుండగా మెషిన్ జారి ఆయన కుడిచేతి బొటనవేలికి తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా వెంటనే ఆర్కే8 డిస్పెన్సరీకి చేరుకున్నారు. క్షతగాత్రుడిని అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి పంపించి, వైద్యాధికారులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అమోర్ ఆసుపత్రికి రెఫర్ చేయించి పంపించారు. వీరి వెంట పిట్ సెక్రటరీ మురళి చౌదరి, గునిగంటి నర్సింగరావు ఉన్నారు.

## కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



* జోడేఘాట్‌లో ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందు

**కెరమెరి, అక్టోబర్ 3, ప్రభాతవార్త:**

కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీన జోడేఘాట్‌లో ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమురం భీం 86వ వర్ధంతి కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 26న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో గిరిజనులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, పారిశుద్ధం, వైద్య సేవలు, రవాణా, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన సంఖ్యలో తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి వసతులను ఏర్పాటు చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సులభంగా కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా రహదారుల నిర్వహణ, సూచిక బోర్డులు, స్వాగత ఏర్పాట్లు, సమాచార కేంద్రాలు, సహాయక సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కొమురం భీం జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి, ఆదివాసీల హక్కుల కోసం చేసిన ఉద్యమాన్ని ప్రతిబింబించేలా వర్ధంతి కార్యక్రమ నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ సూచించారు. గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కొమురం భీం మనవడు సోనేరావు, వివిధ గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకువచ్చారు. వర్ధంతి కార్యక్రమంలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత కల్పిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వర్ధంతి కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత, ఐటీడీఏ పీఓ మంద మకరందం ఆదేశించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, కొమురం భీం మనవడు సోనేరావు, గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి
# ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

వయోవృద్ధుల సంక్షేమం, హక్కుల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు భావితరాలకు ఒక దిక్సూచి లాంటివారని, వారు ఎదుర్కొన్న ఒడిదుడుకులు, కుటుంబాన్ని నిలబెట్టిన తీరు నేటి తరం పాటించాలని తెలిపారు. వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి అని, వారి అనుభవాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధురాలు మహిళా సంఘాలలో సభ్యులుగా చేరితే ఎంతో భరోసా కలుగుతుందని, వ్యక్తిగత సమస్యలు గ్రూపు సభ్యులతో చర్చించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నం. 14567 కు కాల్ చేసి వివరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించిన రాజేశ్వరి, భూదేవి లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు డిపిఎం లు, ఎపిఎం లు, సెర్ప్ సిబ్బంది, వయోవృద్ధులు పాల్గొన్నారు.



## మానసిక స్థైర్యం, స్త్రీ సాధికారతే
# బియాండ్ ది హురైజన్ లక్ష్యం

✳ కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా

✳ మహిళలు ఎందులోనూ తక్కువ కాదు.. మూస ధోరణులు మారాలి

✳ మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ

**బజార్‌హత్నూర్ ప్రభాతవార్త:**



మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే బియాండ్ ది హురైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్ జాతీయ ప్రచార యాత్ర ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, కష్టాలు, మానసిక కుంగుబాటును ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బియాండ్ ది హురైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్ జాతీయ ప్రచార యాత్రపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. యాత్ర ఉద్దేశాలు, ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను మిగతా 2లో..

# మానసిక స్థైర్యం, స్త్రీ సాధికారతే బియాండ్ ది హురైజన్ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మానసిక ఆరోగ్యం ఎంతో కీలకమైన అంశమన్నారు. భవిష్యత్తు గురించి అతిగా ఆందోళన చెందకుండా, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను అర్థం చేసుకుంటూ జీవితాన్ని సానుకూల దృక్పథంతో కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు చదువు, ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు మానసికంగా దృఢంగా ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో బాలురు, బాలికల మధ్య ఎలాంటి వివక్ష, అసమానతలు ఉండకూడదని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ సమానమే అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా ఏదైనా విషయంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయినప్పుడు వారిని చులకనగా చూడకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులు, మిత్రులు, సమాజంపై ఉందన్నారు. ఎవరైనా మానసికంగా కుంగుబాటుకు గురైనట్లు అనిపిస్తే సమస్యను ఒంటరిగా ఎదుర్కోవద్దని సూచించారు. కుటుంబ సభ్యులు, మిత్రులు లేదా వైద్య నిపుణులతో మాట్లాడటం ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మానసిక ఆరోగ్యంపై ఉన్న అపోహలను తొలగించి, అవసరమైనప్పుడు సహాయం కోరేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బియాండ్ ది హురైజన్ ప్రచార యాత్రలో భాగంగా ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన లభించిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా బాలికలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నారని చెప్పారు. మానసిక ఆరోగ్యంపై పట్టణ ప్రాంతాలతోపాటు మారుమూల ప్రాంతాల్లోనూ విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కీలకపాత్ర పోషించాలని మీడియా ప్రతినిధులను కోరారు. మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ మాట్లాడుతూ.. తాను ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచే పెద్దయ్యాక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడపాలనే కల ఉండేదన్నారు. అయితే అనారోగ్య సమస్యల కారణంగా కొంతకాలం ఆ కలను నెరవేర్చుకోలేకపోయానని తెలిపారు. 2021లో బైక్ నడపడం నేర్చుకున్నానని, 2024లో సొంతంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేసినట్లు వివరించారు. 2025లో తొలి ప్రచార యాత్రను నిర్వహించానని, ప్రస్తుతం రెండో బియాండ్ ది హురైజన్: ఎ రైడ్ ఫర్ రెసిలియన్స్ ప్రచార యాత్రను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బైక్ యాత్ర ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతోపాటు మహిళల సామర్థ్యంపై సమాజంలో ఉన్న మూస ధోరణులను మార్చాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మహిళలు ఏ విషయంలోనూ పురుషుల కంటే తక్కువ కాదని, వారికి అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా తమ ప్రతిభను చాటుకోగలరని సెహర్ హష్మీ అన్నారు. మహిళలు బైక్ నడపడం, సాహస యాత్రలు చేయడం వంటి అంశాలపై సమాజంలో ఉన్న సంప్రదాయ అభిప్రాయాలు, మూస ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతోపాటు, తమ లక్ష్యాలను సాధించేందుకు వారిని ప్రోత్సహించడమే యాత్ర ఉద్దేశమని వివరించారు. అనంతరం మానసిక ఆరోగ్యంపై రూపొందించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. అంతకుముందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ అండ్ కామర్స్)లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, మానసిక ఆరోగ్య ప్రచారకర్త సెహర్ హష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచన, మహిళా సాధికారత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ప్రచార యాత్ర రైడర్లు పరాస్, అమిత్ త్యాగి, రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం, తదితరులు పాల్గొన్నారు.




## మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరం ఇలాంటి మేళాలు నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. యువత నైపుణ్యాలను, సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. మేళాకు హాజరైన కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు, నిరుద్యోగులకు నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో జాబ్ మేళా నిర్వాహకులు చందర్, జిల్లా భాజపా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, చిప్పకుర్తి శ్రీనివాస్, శివాగౌడ్, నాయకులు మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, ఎల్కుల మల్లయ్య, పుల్ల అశోక్, కుంచాల విజయ్, కుకిడే రాజేశ్వర్, మోతిరాం, సర్పంచులు చంకాపురే లావణ్య, రాచర్ల మహేష్, అగ్గిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**



కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పే స్లిప్‌లు, యూనిఫామ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రెండో రోజు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న ధర్నాకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో భీం ఏజెన్సీ నిరక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలని, ప్రతి నెల పే స్లిప్‌లు, నాణ్యమైన యూనిఫామ్‌లు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని భీం ఏజెన్సీని తొలగించి కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాలని, సూపరింటెండెంట్ సమస్యల పరిష్కారానికి బాధ్యత వహించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆస్పత్రి ఆవరణలో మెడికల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ నిర్వహిస్తున్న ధర్నా వద్దకు అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మాట్ చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ ధర్నాకు సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చారి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు తాళ్లపెల్లి దివాకర్ గౌడ్, భోగే ఉపేందర్, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సదరం శిబిరాల తేదీలు ప్రకటన

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సదరం క్యాంపు తేదీలను అధికారులు ప్రకటించారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్న దివ్యాంగులు ఆయా తేదీలలో ఉదయం 9 గంటలకు నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి హాజరుకావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సూపరింటెండెంట్ నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 6, 13, 27 తేదీలలో ఆర్థోపెడికల్లీ హ్యాండిక్యాప్డ్ అండ్ సీపీఏ, అక్టోబర్ 7, 14, 28 తేదీలలో హియరింగ్ ఇంపెయిర్మెంట్, అక్టోబర్ 8, 15, 22, 29 తేదీలలో లో విజన్, అక్టోబర్ 9న ఇంటలెక్చువల్ అండ్ ఎంఐ వైకల్యాలకు పరీక్షలు నిర్వహిస్తారు. శిబిరానికి వచ్చేవారు మీ సేవ సదరం స్లాట్ బుకింగ్ రసీదు, ఆధార్ కార్డు జిరాక్స్, కాలపరిమితి అయిపోయిన పాత సదరం సర్టిఫికేట్స్ ఉన్నవారు పాత డబ్ల్యూఏపీ/వైఏపీ/ఆర్ఏపీ రేషన్ కార్డు జిరాక్స్, కొత్త పాస్ పోర్ట్ సైజు ఫోటో తీసుకురావాలి. కంటి వైకల్యం వారు సరోజినీ దేవి, ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ రిపోర్ట్స్, చెవిటి మూగ వారు ఈఎన్టీ కోఠి ప్రభుత్వ హాస్పిటల్ నుండి బీఈఆర్ఏ అండ్ పీటీఏ రిపోర్ట్స్, ఎంఆర్ అండ్ ఎంఐ వారు బోయినపల్లి మెంటల్ హాస్పిటల్ నుండి ఐక్యూ అసెస్మెంట్ రిపోర్ట్, ఆర్థోపెడిక్ వారు పాత/కొత్త ఎక్స్‌రే రిపోర్ట్, సీపీఏ వారు కొత్త ఎంఆర్ఐ అండ్ సీటీ స్కానింగ్ రిపోర్ట్ ఒరిజినల్, జిరాక్స్ లతో పాటు తాము తెలియజేసిన సెల్ నంబర్ వెంట తీసుకుని హాజరుకావాలని సూచించారు.

## గోదావరి పుష్కరాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

**- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

గోదావరి పుష్కరాల పనులన్నీ గడువులోగా రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజా రామయ్యర్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం సాయంత్రం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి హైదరాబాదు నుంచి పలు జిల్లాల కలెక్టర్లతో పుష్కరాల పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుష్కరాల పనులను కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పుష్కరాలకు అవసరమైన భూసేకరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పుష్కరాల పనులపై పలు కీలక సూచనలు చేశారు. పనులు పూర్తి చేయడానికి గడువు నిర్ణయించుకొని, ఆ గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పుష్కరాల పనులను సమన్వయంతో చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుక కొరత తలెత్తకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసరతో పాటు, జిల్లాలో పుష్కరాలు జరిగే అన్ని ప్రాంతాల్లో పకడ్బందీగా పనులు చేపడుతున్నట్లు వివరించారు. సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో పనులు గడువులోగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. పుష్కరాల పనులు నాణ్యవంతంగా చేపడతామని తెలిపారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈ వీసీలో నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల లు సుభాష్, అనిల్, సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల తిప్పల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

### మార్చి నుంచి రాని బిల్లులు.. ఆవేదనలో కార్మికులు

**నార్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులు గత ఏడు నెలలుగా బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్చి నెల నుంచి సెప్టెంబర్ వరకు బిల్లులు నిలిచిపోవడంతో సొంతంగా అప్పులు తెచ్చి సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని నార్నూర్ మండల కార్మికులు వాపోతున్నారు. మండల పరిధిలోని 60 పాఠశాలల్లో పనిచేస్తున్న 60 మంది కార్మికులు కుటుంబ పోషణ భారమై పడరాని పాట్లు పడుతున్నామని తెలిపారు. ఇతర మండలాల్లో ప్రతి నెలా బిల్లులు ఇస్తున్నప్పటికీ, తమకు మాత్రం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి బకాయి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**బిల్లులు చెల్లించి ఆదుకోవాలి**

ఝాడే తాయి బాయి, మధ్యాహ్న భోజన కార్మికుల మండల అధ్యక్షురాలుతాము చేసిన పనికి సంబంధించిన భోజన బిల్లులను అధికారులు సకాలంలో చెల్లించి ఆదుకోవాలి. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఇప్పటికే వేల రూపాయిల అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. కుటుంబ పోషణ కూడా భారంగా మారింది, వెంటనే బకాయిలు విడుదల చేయాలి.

## చెత్తాచెదారం తొలగించి గ్రామాన్ని శుభ్రం చేసి..

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామంలో గత కొన్ని రోజులుగా మల్టీ పర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) విధులకు హాజరుకాకపోవడంతో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య నెలకొంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ సిబ్బంది కోసం వేచి చూడకుండా స్థానికులు చొరవ తీసుకున్నారు. ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసి గ్రామంలోని వివిధ వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రం చేయించారు. దీంతో ప్రధాన వీధులు, నివాస ప్రాంతాల్లో పారిశుద్ధం మెరుగుపడింది. గ్రామ పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు, సిబ్బంది నిరంతరం దృష్టి సారించి చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం

**- నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి**

**- ఐటీడీఏ పీఓ మంద మకరందు**

**ఉట్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు. శనివారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్ మండలంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన, సమతుల్య పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని పీఓ ఆదేశించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతల్లో పోషకాహార లోపం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, స్థానికంగా లభించే పోషకాలతో కూడిన ఆహారంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ప్రాథమిక విద్యకు, శారీరకసామాజిక వికాసానికి బలమైన పునాదులుగా పనిచేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్ ద్వారా లభించే సేవలు, పథకాలపై స్థానిక సర్పంచులకు సీడీపీఓ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆత్రం తిరుపతి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మరసకోల సరస్వతి, సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు

జన్నారం, అక్టోబర్ 3, ప్రభాతవార్త

జన్నారం అటవీశాఖ డివిజనల్ అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వన్యప్రాణి వారోత్సవాల భాగంగా రెండవ రోజు శనివారం రోజు జన్నారం డివిజన్ కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలోని ఇందనపల్లి రేంజ్ భర్తనపేట సెక్షన్ నర్లాపూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రకృతి నడక కార్యక్రమంలో కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి చెందిన 30 మంది ఎమ్మెస్సీ విద్యార్థులు, ఐదుగురు అధ్యాపకులు పాల్గొన్నారు. గేట్ నెంబర్ 5 నుండి నర్లాపూర్ లోని మైసమ్మ కుంట వరకు ప్రకృతి నడక నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలోని వివిధ రకాల భూభాగ స్వరూపాలు, వృక్ష జాతులు మరియు సహజ వృక్ష సంపదను పరిశీలించారు. అటవీ ప్రాంతంలో సంచరించే వివిధ వన్యప్రాణుల పాదముద్రలు, మల విసర్జన (స్కాట్) తదితర ఆనవాళ్లను పరిశీలించి వన్యప్రాణుల ఉనికి, సంచారం మరియు ఆవాస పరిస్థితులపై అవగాహన పొందారు. అదేవిధంగా పక్షుల పరిశీలన (బర్డ్ వాచింగ్) కార్యక్రమంలో వివిధ రకాల పక్షి జాతులను ప్రత్యక్షంగా వీక్షించి వాటి ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థలో వాటి ప్రాధాన్యత గురించి తెలుసుకున్నారు. ఈ ప్రకృతి నడక ద్వారా విద్యార్థులు అటవీ పర్యావరణ వ్యవస్థ, వృక్షజాలం, వన్యప్రాణులు మరియు జీవ వైవిధ్య పరిరక్షణపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ఎం. రామ్ మోహన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.కె. బాబా ఖాదర్ వలీ, సెక్షన్ ఆఫీసర్ ఎ. హన్మంత్ రావు, బీట్ ఆఫీసర్లు టి. పోచయ్య, సయ్యద్ తన్వీర్ బాషా, ఎం. భాస్కర్ మరియు టీఏ మహేష్ విద్యార్థులకు అటవీ నిర్వహణ, రక్షణ చర్యలు మరియు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు.

## డిబేట్, వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన కిష్టాపూర్ విద్యార్థులు

### - నగదు బహుమతి అందుకున్న విద్యార్థులు

జన్నారం, అక్టోబర్ 3, ప్రభాతవార్త

వారధి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గత నెలలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన మరియు డిబేట్ పోటీల్లో కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసే పదవి విరమణ పొందిన మోహన్ కందా ఐఏఎస్, ఫౌండర్ చైర్మన్ మరియు డైరెక్టర్ అపర్ణ రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ జిల్లా పరిషత్ మోడల్ స్కూల్స్ మరియు ఇతర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు సాధించి అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనికేషన్ స్కిల్స్ పైన విద్యార్థులను ప్రగతి సాధించాలని సంకల్పంతో ఏటా నిర్వహిస్తున్న వ్యాసరచన, డిబేట్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిష్టాపూర్ కు చెందిన పదవ తరగతి విద్యార్థులు కొత్తపెల్లి త్రివేధ, మెండే నందిని, 9 వ తరగతికి చెందిన సిలివేరి స్నాగ్నశ్రీలు నిజమైన అభివృద్ధికి కేవలం ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా పౌరుల చురుకైన భాగస్వామ్యం కూడా అవసరం అనే అంశంపై జరిగిన డిబేట్ పోటీలో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానాన్ని సాధించి రూపాయలు 27 వేలు నగదు బహుమతి మరియు ప్రశంస పత్రాలు అందుకున్నారు. అలాగే నాణ్యమైన విద్య అనేది ఐక్యరాజ్యసమితి యొక్క అనేక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి పునాది వంటిది అనే అంశంపై జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో పదవ తరగతి విద్యార్థినిలు ఆకుల అనన్య, చెట్టుపల్లి మోక్ష శ్రీ, ధనాలకోట లాస్యలు రాష్ట్రస్థాయిలో మూడో స్థానం సాధించి రూపాయలు ఇరవై ఏడు వేల నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాలను అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, గైడ్ టీచర్లు దాముఖ కమలాకర్, ఎదులపురం గోవర్ధన చారి, ప్రకాష్ బానోత్, విద్యార్థినులను, ఉపాధ్యాయ బృందాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండా రాజన్న, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, మండల విద్యాధికారి బి. రాజేందర్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్ మంగ అభినందనలు తెలిపారు. వారధి ఫౌండేషన్ పోటీలో రాష్ట్ర స్థాయిలో వరుసగా నాలుగు సంవత్సరాల నుండి గెలుపొందడం అభిందనీయమని ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న తెలిపారు.



# కార్మికుల హక్కులు మాటలతో కాదు.. పోరాటాలతోనే సాధ్యం

### ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య - ఆర్.కె-5 గనిలో ఏఐటీయూసీలోకి భారీగా చేరికలు

నస్పూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త



కార్మికుల హక్కులు కేవలం మాటలతో రావు, నిరంతర రాజీలేని పోరాటాల ద్వారానే వాటిని సాధించుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ-ఎస్సీడబ్ల్యూయూ) అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం ఆర్.కె-5 పిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్.కె-5 గనికి చెందిన 104 మంది యువ కార్మికులు ఏఐటీయూసీలో చేరగా, యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రెటరీ బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ మోత్కూరి కొమురయ్య తదితరులు వారికి ఎర్ర కండువాలు కప్పి యూనియన్‌లోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఎన్నికైన నాటి నుంచి కార్మిక సంక్షేమమే ధ్యేయంగా సేవ్ సింగరేణి జాతా, హెడ్ ఆఫీస్ ముట్టడి, సమ్మె నోటీసు వంటి అనేక ఉద్యమ కార్యాచరణలను చేపట్టిందన్నారు. సమ్మె నోటీసు నేపథ్యంలో రీజనల్ లేబర్ కమిషనర్ ఎదుట పలు దఫాలుగా జరిపిన చర్చల ఫలితంగానే 24 ప్రధాన డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందాలు సాధించినట్లు వివరించారు. అగ్రిమెంట్లు చేయించేది మనమే.. వాటిని అమలు చేయించే బాధ్యత కూడా మనదే అని, ఒప్పందాలు చేసి చేతులు దులుపుకునే సంఘం ఏఐటీయూసీ కాదని తేల్చిచెప్పారు. కుదిరిన అగ్రిమెంట్ల అమలులో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి మనుగడ యువ కార్మికుల భుజస్కంధాలపైనే ఆధారపడి ఉందని, యువతకు యూనియన్‌లో ప్రాధాన్యతనిచ్చి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు. సంస్థ మనుగడకు కొత్త గనుల ఆవశ్యకత ఎంతో ఉందని, కేంద్రం నిర్వహించే వేలంపాటలో యాజమాన్యం చురుగ్గా పాల్గొని కొత్త బ్లాకులను దక్కించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, తిరుపతి, నాగరాజు, పున్నం చందు, మోహన్, ఎస్కే ఇమ్రాన్, ఖాదర్ బాబు, హరికృష్ణ, స్వామి, కృష్ణ, సుధీర్, ప్రశాంత్, సాయి, సంతోష్, సతీష్, వరుణ్, రామకృష్ణ, కళ్యాణ్, విద్యాసాగర్, సుధాకర్, శంకర్, తిరుపతి, సారయ్య, శ్యామ్, వంశీ, రవీందర్, ఎల్. రమేష్, మహిళా కార్మికులు మహేశ్వరి, రాజేశ్వరి, రజిత సహా మొత్తం 104 మంది కార్మికులు యూనియన్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ అడ్డూ శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మీడియా అధికార ప్రతినిధి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు మాడగోని మల్లేష్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్ రావు, ప్రవీణ్, సత్యనారాయణ, నాయకులు జీపీ రావు, రెడ్డిపాక లక్ష్మణ్, విశ్వనాథరెడ్డి, సుందిళ్ల నరేష్, బండ మధుకర్ రెడ్డి, భోగ మధునయ్య, మహేందర్, రాజమణి, తిరుమల, చైతన్య తదితరులు పాల్గొన్నారు.




## తిలక్ వాకర్స్ సేవలు అభినందనీయం

### - మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

బెల్లంపల్లి, అక్టోబర్ 03, ప్రభాతవార్త

సమాజ సేవే లక్ష్యంగా తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ అన్నారు. శుక్రవారం రాత్రి రాంజీగోండు వద్ద నిర్వహించిన తిలక్ వాకర్స్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దావ స్వాతి రమేష్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా తిలక్ వాకర్స్ సభ్యులు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ సమాజంలోని పేదలు, అవసరమైన వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ హనుక్, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కౌన్సిలర్ కంకటి ప్రణిత శ్రీనివాస్ పాల్గొన్నారు. తిలక్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి కంటేవాడ నగేష్ వివరించారు. అనంతరం ముఖ్య అతిథులను తిలక్ వాకర్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా తిలక్ వాకర్స్ ఆధ్వర్యంలో నూతనంగా అన్నపూర్ణ పథకం ప్రారంభించారు. అవసరమైన వారికి ఆహారం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిలక్ వాకర్స్ అధ్యక్షుడు రంగ రామన్న, కోశాధికారి కజ్జం రమేష్, వ్యవస్థాపక అధ్యక్షుడు రత్నం రాజన్న, సభ్యులు కోడి రమేష్, చేను రవి, పోలె శ్రీనివాస్, వెంకటరాజం, పాత భాస్కర్, రాజ్‌కుమార్, గంట శ్రీనివాస్, లింగయ్య, సత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్ పోచమ్మ దేవాలయంలో ఘనంగా శాంతి హోమం

### - అమ్మవారి పునఃప్రతిష్ఠాపన 41వ మండల కాలం వేడుకలు

నస్పూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త

నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ 41వ మండల కాలం వేడుకల్లో భాగంగా శనివారం శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ బండారి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. వేద పండితులు బుడి అనుదీప్ శర్మ, సుబ్బ అభిషేక్ శర్మల పౌరోహిత్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, కలశ పూజ, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేష రుద్రాభిషేకాలు, అర్చనలు జరిపి, లోక కళ్యాణార్థం పూర్ణాహుతితో శాంతి హోమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ కాలనీ, వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసమల్ల దేవేందర్, ఉపాధ్యక్షుడు గడ్డల మధుకర్, కమిటీ సభ్యులు బోడ రాజేష్, అశోక్, గుమ్మడి తిరుపతి, జవాడి సాంబయ్య, మండ సురేష్, వీరయ్య, మొగిళి తిరుపతి, సామ రఘుపతి, పోగుల భీమయ్య, పాలగాని సురేష్, అల్లోజు రమేష్, కుందారపు సురేష్, పోతునూరి శివప్రసాద్, మహేందర్, రణదీప్, లక్కోపరం రవి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలి

**- పిఎల్ఆర్ బోనస్‌ను రూ.1.15 లక్షలకు పెంచాలి - టిఎన్టియుసి నాయకుల డిమాండ్**

**బెల్లంపల్లి, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు 40 శాతం లాభాల వాటాను చెల్లించాలని డిమాండ్ చేస్తూ టిఎన్టియుసి ఆధ్వర్యంలో శుక్రవారం కైరిగూడ ఓపెన్‌కాస్ట్ జనరల్ మేనేజర్ (ఎస్ఓఎమ్)కు వినతిపత్రం అందజేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థ 60 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించగా, 58 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించిందని నాయకులు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సంస్థ వాస్తవ లాభాలను ప్రకటించకపోవడం వల్ల కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. సింగరేణి కార్మికులు సంస్థ ప్రగతికి పునాదులుగా నిలుస్తున్నందున, వాస్తవ లాభాలను ప్రకటించి 40 శాతం వాటాను చెల్లించే తేదీని వెంటనే ఖరారు చేయాలని కోరారు. దీపావళికి ముందు చెల్లించే ప్రాఫిట్ లింక్డ్ రివార్డ్ స్కీం (పిఎల్ఆర్) బోనస్‌ను రూ.1,15,000కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఏడాది కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,000 చెల్లించిన విధంగానే కాకుండా, పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని కోరారు. అదేవిధంగా పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,000కు తగ్గకుండా వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కోల్ ఇండియాలో మాదిరిగా సింగరేణిలోనూ ఫస్ట్ కేటగిరీ వేతనం అమలు చేయాలని, సిపిఆర్ఎంఎస్‌లో అధికారులు, కార్మికులకు ఎలాంటి వ్యత్యాసం లేకుండా రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచాలని, అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన పనిముట్లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్మికులకు పనిముట్ల కొరత ఉన్నప్పటికీ సమస్యను పరిష్కరించాల్సిన గుర్తింపు కార్మిక సంఘం, ప్రాతినిధ్య సంఘాలు కేవలం వినతిపత్రాలకే పరిమితం కావడం సరికాదని విమర్శించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొగ్గు బెల్ట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సింగరేణి వాస్తవ లాభాలను తక్షణమే ప్రకటించి కార్మికులకు న్యాయం చేయకపోతే టిఎన్టియుసి ఆధ్వర్యంలో అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్**

**తాండూర్, అక్టోబర్ 4, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీరమేష్ అన్నారు. గోలేటిలోని జిఎం కార్యాలయం ఆవరణలో శనివారం (స్వచ్ఛత) స్పెషల్ క్యాంపెయిన్ 6.0 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయం ఆవరణలో అధికారులు, ఉద్యోగులతో కలిసి గడ్డి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ కోసం చెట్లను నరకాల్సి వస్తోందని, పేపర్ ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు. పిల్లలకు కూడా స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించాలని, ఇంటి దగ్గర వారి పనులు సక్రమంగా చేసుకొనేల పర్యావరణం, పరిసరాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. గత ఏడాది స్వచ్ఛతలో బెల్లంపల్లి ఏరియాకు ద్వితీయ బహుమతి వచ్చిందని, ఈసారి ప్రథమ బహుమతి వచ్చేలా ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. కార్యాలయంలోని రికార్డులు, సామాగ్రిని క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ భారత్ కోసం ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలన్నారు. 30 రోజుల పాటు సాగనున్న స్వచ్ఛత పనుల పట్ల అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వీరన్న, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, ఎస్వోటు జిఎం స్వామి రాజు, సివిల్ ఎస్ఈ శ్రీధర్, ఎన్విరాన్మెంట్ అధికారి జైపాల్ జాదవ్, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.శ్రీనివాస్, ఏఐటియుసి నాయకుడు కె.కిరణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.




## వీధుల్లో పశువులను వదలొద్దు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులను విచ్చలవిడిగా వదలడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పురపాలక సంఘం కమీషనర్ అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల సంచారం కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపై వదలకుండా సొంత స్థలాల్లోనే ఉంచాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై పశువులను వదిలితే తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019 ప్రకారం జరిమానాలు, ఇతర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వాహనదారుల భద్రత దృష్ట్యా పశువులను రోడ్లపైకి వదలకుండా సహకరించాలని పురపాలక సంఘం అధికారి కోరారు.



## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చని కాంగ్రెస్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ విమర్శించారు. శనివారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ, ఉద్యోగ భద్రత, 32 సమస్యల పరిష్కారం తదితర అంశాల్లో ప్రభుత్వం నిరక్ష్యం చేస్తోందని ఆరోపించారు. అక్టోబర్ 9న జరిగే ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు కోదురుపాక మహేశ్, నాయకులు ప్రవీణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు



## జన్నారం పోలీసుల ఆధ్వర్యంలో నాకాబంది

**జన్నారం, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

రామగుండం కమిషనరేట్ ఆదేశాల మేరకు జన్నారం ఎస్సై గుర్రపు ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో శనివారం రోజున నాకాబంది కార్యక్రమం నిర్వహించారు. నాకాబందీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సరైన నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, నంబర్ ప్లేట్ ను వంచడం, మార్చడం లేదా నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, చెల్లుబాటయ్యే ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా గాని, అనుమానాస్పద వాహనాలు కనబడిన గాని పోలీసులకు సమాచారం అందించాలని. నేరాల నియంత్రణే లక్ష్యంగా, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే ధ్యేయంగా రామగుండం కమిషనరేట్ ఆధ్వర్యంలో నాకాబంది కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

## పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

**జన్నారం, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే సేవాభావంతో పోనకల్ గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ తెలిపారు. చందా న్యూరో అండ్ ట్రామా కేర్ సెంటర్ వారి సహకారంతో, పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ప్రముఖ వైద్యులు డా.చందా శ్రీనివాస్ (ఫుల్ టైమ్ న్యూరో సర్జన్), డా. కలువ లీలా శర్వాణి (రేడియాలజిస్ట్), డా. స్వాతి (ఎంబిబిఎస్, ఎండి), డా. ప్రశాంతి (ఎంబిబిఎస్), డా. అలేఖ్య (ఎంబిబిఎస్), డా. వంశీ (క్రిటికల్ కేర్) వైద్య సేవలు అందించనున్నారు. వైద్య శిబిరం జన్నారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న స్లేట్ (సిబిఎస్ఈ)స్కూల్ లో ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కోరారు.

## కాసిపేట1 ఇన్‌క్లైన్‌లో జీఎం విస్తృత తనిఖీ

**- ఉత్పత్తి, భద్రత, నాణ్యతకు తొలి ప్రాధాన్యం**

**- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ**

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



సింగరేణి మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట1 ఇన్‌క్లైన్ గనిలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శనివారం విస్తృతంగా తనిఖీ నిర్వహించారు. గనిలోని 3 సీమ్ నార్త్ వర్కింగ్స్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి బొగ్గు ఉత్పత్తి పనుల తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ గని ఉత్పత్తి, ఉత్పాదకతను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు కార్మికుల భద్రత, బొగ్గు నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టి నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు. గనిలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ తనిఖీలో కాసిపేట1 ఇన్‌క్లైన్ మేనేజర్ డి. సతీష్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్, సర్వే ఆఫీసర్ రవీందర్‌తో పాటు ఇతర అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ఈ నెల 5న ప్రజావాణి కార్యక్రమం రద్దు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

ఈ నెల 5న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హరిత శనివారం ఒక ప్రకటనలో రాష్ట్ర తెలిపారు. నిర్మల్ జిల్లాలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.



## ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కేంద్రే చంద్రకాంత్

**కెరమెరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**

మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా కేంద్రే చంద్రకాంత్, ఉప అధ్యక్షుడు కూటికెల వెంకటస్వామి ప్రధాన కార్యదర్శిగా ఏజాజ్, కోశాధికారిగా రాజేవాడేకర్ పద్మాకర్ సంయుక్త కార్యదర్శి పాలకుర్తి సంజీవ్, కార్యనిర్వాహక కార్యదర్శి రాథోడ్ రమేష్ , గౌరవ అధ్యక్షుడు గోగ్గర్ల బాలాజీ, సలహాదారులుగా గిత్తే కిరణ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు కేంద్రే చంద్రకాంత్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల, ఇండ్ల దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ సభ్యులను పలువురు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు

## పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

### - స్వచ్ఛతను నిత్యకృత్యంగా మార్చుకోవాలి

### - జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారమని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు బాధ్యత వహించాలని మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 'స్పెషల్ క్యాంపెయిన్6 – స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. అపరిశుభ్రత కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఇళ్లు, పరిసరాలు, కార్యాలయాలు, పని ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారానికి కనీసం రెండు గంటల పాటు శ్రమదానం చేసి పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణను అలవాటుగా మార్చుకుంటే రాబోయే తరాలకు మంచి మార్గదర్శకంగా నిలుస్తామని తెలిపారు. కార్యాలయాలు, గనులు, పని ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మరింత మెరుగుపడుతుందని జీఎం పేర్కొన్నారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను నిత్యకృత్యంగా మార్చుకుని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, ఎన్విరాన్‌మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పీఓ ఎం. కార్తీక్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సి.వి. రమణ, జీఎం కార్యాలయ ఫిట్ సెక్రటరీ గీతికతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.




# పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ అండగా నిలుస్తుంది

**ఆసిఫాబాద్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**



పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు జిల్లా పోలీస్ శాఖ అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సుమారు 2,700 మంది హాజరుకాగా, ప్రతిభ ఆధారంగా 150 మందిని ఎంపిక చేసి వారికి ఉచిత వసతి, భోజనం, శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణలో భాగంగా అంకగణితం, తార్కిక సామర్థ్యం తదితర అంశాలపై ఉచిత అధ్యయన సామగ్రిని ఇప్పటికే అందించినట్లు తెలిపారు. అభ్యర్థుల విద్యా ప్రగతిని అంచనా వేసేందుకు ఇప్పటివరకు మూడు పరీక్షలు నిర్వహించామని, ఆగస్టు 31న ప్రారంభించిన ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. రాత పరీక్షకు సమర్థవంతంగా సిద్ధమయ్యేలా అవసరమైన పుస్తకాలు, అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉంచడంతో పాటు అభ్యర్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రాత పరీక్షతో పాటు పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో నిర్వహించే శారీరక దారుఢ్య పరీక్షలకు కూడా అభ్యర్థులు సిద్ధమయ్యేలా ప్రత్యేక శారీరక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు కల్పిస్తున్న వసతి, భోజన సదుపాయాల నాణ్యతను కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ ఉచిత వసతి శిక్షణ కార్యక్రమం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే శిక్షణను తమ జిల్లాలోనే ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు హాజరయ్యే అభ్యర్థులకు విద్యా, శారీరక శిక్షణతో పాటు సమర్థవంతమైన మార్గదర్శకత్వం అందించి, రిక్రూట్‌మెంట్ ప్రక్రియకు వారిని పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆసిఫాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నీలం రవి, పోలీస్ సిబ్బంది, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో గురిబాయి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అజ్మీరా శ్యామ్ నాయక్

**కెరమెరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:**



మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అంబాజీ మాతృమూర్తి గురిబాయి మరణించిన విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ దేవాపూర్ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి గురిబాయి గారి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబాజీ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, గురిబాయి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కెరమెరి మండల అధ్యక్షుడు సుజాత ఖాన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లప్ప ,రజక, సుదర్శన్, రావి నాయక్, గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా వేంపల్లి అటవీ ప్రాంతంలో విద్యార్థులకు వన్యప్రాణులు, అటవీ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాగజ్‌నగర్ అటవీ శాఖ అధికారి టి. భార్గవ్‌కుమార్ ఐఎఫ్ఎస్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వేంపల్లి సెక్షన్‌లోని వేంపల్లి బీట్‌లో నిర్వహించిన 'వనదర్శిని' కార్యక్రమంలో వేంపల్లి డీఆర్ఓ శశిధర్‌బాబు, కాగజ్‌నగర్ డీఆర్ఓ హేమలత, వేంపల్లి బీట్ అధికారి విజయ్‌చంద్ర, వాచర్లు కోవా విజయ్, వాసుదేవ్, కాగజ్‌నగర్ నవోదయ పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అడవులు, వృక్షజాలం, జంతుజాలం, వన్యప్రాణుల సంరక్షణ ప్రాముఖ్యతపై అటవీ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం అటవీ ప్రాంతంలోని సోలార్ పీటీ, వుడెన్ మచాన్, చిరుత పాదముద్రలు, వేంపల్లి వాచ్‌టవర్ ప్రాంతాలను విద్యార్థులకు చూపించారు. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు తెలిపారు.




### నస్పూర్ రోడ్డు ప్రమాదం..

## చికిత్స పొందుతూ మరో యువతి మృతి

### ఆరుకు చేరిన మృతుల సంఖ్య.. తీవ్ర విషాదంలో వెంకటాపూర్

**నస్పూర్, అక్టోబర్ 3, ప్రభాతవార్త**



నస్పూర్ గేట్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సల్లూరి అనూష (20) శనివారం ఉదయం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూసింది. గత సోమవారం మంచిర్యాలకు విధులకు వెళ్తుండగా ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఇప్పటికే ఐదుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. తీవ్ర గాయాలపాలైన అనూషను మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె ప్రాణాలు విడిచింది. అనూష మరణంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య ఆరుకు చేరింది. వరుస మరణాలతో మృతురాలి కుటుంబంతో పాటు ఆమె స్వగ్రామమైన మందమర్రి మండలం వెంకటాపూర్‌లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



## ఎల్లూర్ చెరువు వద్ద బర్డ్‌వాక్

**పెంచికల్ పేట్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎల్లూర్ చెరువు వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో బర్డ్‌వాక్ నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ పక్షులను పరిశీలించారు. పర్యావరణ సమతుల్యతలో పక్షుల పాత్ర, రైతులకు వాటి ఉపయోగం, వలస పక్షుల గురించి అటవీ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్ఓ అస్మా, ఎఫ్ఎస్ఓలు అహ్మద్ అలీ, గోవింద్, ఎఫ్‌బీఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగా ఉచిత వైద్య శిబిరం

### గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. నిపుణులైన వైద్యుల బృందం రోగులను క్షుణ్ణంగా పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయడాన్ని అభినందించారు. మారుమూల ప్రాంతాల ప్రజలు తమ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన వైజాపూర్ మెడికల్ నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి ప్రజాసేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, డీఎంహెచ్ఓ సాధన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సొమ్ముపై అవినీతి ఆరోపణలు

### - సమగ్ర దర్యాప్తు చేపట్టాలి: విప్లవ కార్మిక సంఘాలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 03, ప్రభాతవార్త**



ధన్‌బాద్‌లోని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపిఎఫ్ఓ) వ్యవహారంలో సుమారు రూ.3.64 కోట్ల నిధుల కుంభకోణం వెలుగులోకి వచ్చినట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సింగరేణి గనికార్మిక సంఘం (ఎస్జికెఎస్), శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎఫ్టియు) డిమాండ్ చేశాయి. కార్మికుల భవిష్యత్ భద్రత కోసం జమ చేసే ప్రావిడెంట్ ఫండ్ నిధుల దుర్వినియోగ ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బొగ్గు కార్మికుల ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ నిధుల భద్రతపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా పీఎఫ్ నిధుల నిర్వహణపై కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జికెఎస్ రాష్ట్ర నాయకులు అంబలం మహేందర్, ఏఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. కార్మికుల నిధుల రక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

**లక్షెట్టిపేట, అక్టోబర్ 3, ప్రభాతవార్త**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన ను ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా ధర్మపరి ఆలయాన్ని సందర్శించారు. ప్రిన్సిపాల్ డా. మహాత్మా సంతోష్ ఆదేశాల ప్రకారం అనుభవ పూర్వక అభ్యాసంలో భాగంగా కార్యక్రమ కన్వీనర్ డా. తన్నీరు సురేష్ సారథ్యంలో విద్యార్థులు ధర్మపురిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, కాకతీయుల కాలం నాటి శ్రీరామలింగేశ్వర ఆలయం, బ్రహ్మపుష్కరిణి, సత్యవతీ, శ్రీ వేంకటేశ్వర ఆలయాలను సందర్శించి అక్కడి ఆధ్యాత్మిక చారిత్రక విశేషాలను తెలుసుకున్నారు. ధర్మపురి ఆలయ ఈ ఓ శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, పూజారులు కలిసి విద్యార్థులకు ధర్మపురి వైభవాన్ని వివరించారు. చివరలో ధర్మపురిలో శ్రీ లక్ష్మి నరసింహ రైస్ మిల్‌ని సందర్శించి రైస్ మిల్ వ్యాపార వేత్త గునిశెట్టి రవీందర్ నుండి వ్యాపార నిర్వహణపై మెళకువలు నేర్చుకున్నారు. బిజినెస్ రంగంలో నిలబడటాని,కి ఆధ్యాత్మిక వాతావరణానికి, సమాజానికి గల సంబంధాలను ఈ సందర్భంగా విద్యార్థులు నేర్చుకున్నారు. కార్యక్రమ కార్యక్రమంలో అధ్యాపకులు డా. తన్నీరు సురేష్, కవిత, ప్రణవ్, విద్యార్థులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

### - గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

### - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



మండలంలోని ఎందా గ్రామపంచాయతీకి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో వారు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో రాథోడ్ ఉమాజి, రాథోడ్ గుణ్వంత్‌రావు, రాథోడ్ రాజేందర్, చౌహాన్ కళ్యాణ్, పట్టెపు లక్ష్మణ్, రాయల అర్జున్, రాయల ఎల్లన్న, అజయ్, రాజన్న, గోయ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త, నాయకుడు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలను చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ దాసండ్ల ప్రభాకర్, ఎందా గ్రామ సర్పంచ్ రాథోడ్ కిరణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాథోడ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రావణ్ కుమార్‌కు పదోన్నతి

### జెడ్పీ పాఠశాలలో ఘనంగా సన్మానించిన హెచ్ఎం, ఉపాధ్యాయులు

**ఉట్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**




ఉట్నూర్‌కు చెందిన రాథోడ్ శ్రావణ్ కుమార్ ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందడం గర్వకారణమని ఉట్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ రమేష్ అన్నారు. పదోన్నతి పొందిన అనంతరం శనివారం తొలిసారిగా పాఠశాలను సందర్శించిన శ్రావణ్ కుమార్‌ను హెచ్ఎమ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గతంలో ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసిన శ్రావణ్ కుమార్ అంచెలంచెలుగా ఎదిగి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించడం హర్షణీయమన్నారు. విద్యారంగంలో ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి విద్యార్థులకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. సన్మానం పొందిన శ్రావణ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ రమేష్, ఉపాధ్యాయులు కృష్ణ, రాజేందర్, దత్తారం, నగేష్, గోపాల్, సవిత తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలి

### తెలంగాణ రాష్ట్ర రజక ఉపాధ్యక్షుడు సుంకేట పోశెట్టి పిలుపు

**భైంసా, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల (చాకలి) ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మామడ మండలంలోని రజకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. మామడ మండల రజక సంఘం అధ్యక్షుడు ఎన్‌డి. రాజేశ్వర్ ఆదివారం నాటి కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ.. అక్టోబర్ 04 ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐలమ్మ రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకేట పోశెట్టి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘ ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొననున్నారు.

## ఎంపీపీఎస్, ప్రీ ప్రైమరీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

### - విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి

### - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



గుడిహత్నూర్ మండలం వైజాపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్), ప్రీ ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధనా విధానం, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యతను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చిన్నారులతో సరదాగా ముచ్చటించి వారి విద్యా నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నతనంలోనే పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయవచ్చని వెల్లడించారు. ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేసి అత్యుత్తమ విద్యాబోధన అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కోటే, డీఎంహెచ్ఓ సాధన, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, స్థానిక సర్పంచ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చింతగూడలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

### - కొత్త ట్రాన్స్‌ఫార్మర్, మూడు విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**కాగజ్‌నగర్ రూరల్, అక్టోబర్ 3, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బలగల ప్రాంతంలో కొంతకాలంగా నెలకొన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. తరచూ విద్యుత్ అంతరాయం, లోవోల్టేజీ కారణంగా రైతులు, విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులను కలిసి పలుమార్లు వినతులు సమర్పించారు.దీంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు బలగల ప్రాంతానికి కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మూడు విద్యుత్ స్తంభాలను మంజూరు చేశారు. విద్యుత్ సామగ్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఫిట్టింగ్ పనులు, విద్యుత్ లైన్ ఏర్పాటును పూర్తి చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో ప్రాంతంలో విద్యుత్ సరఫరా మెరుగుపడి లోవోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయం సమస్యలకు ఉపశమనం లభించినట్లు గ్రామస్థులు తెలిపారు.విద్యుత్ సమస్య పరిష్కారానికి సహకరించిన సర్పంచ్ పోల్కా లష్మక్క, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మిగిలిన విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.





## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గైక్వాడ్ గంగాధర్‌కు ఘన సన్మానం

### - జాతీయ స్థాయి పదవి ఆయన నిబద్ధతకు దక్కిన గుర్తింపు: ప్రజా సంఘాల నాయకులు

**భైంసా, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

భైంసా మండల పరిధిలోని దేగాం గ్రామంలో ఎంఈఎఫ్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నూతనంగా నియమితులైన గైక్వాడ్ గంగాధర్‌కు వివిధ ప్రజా సంఘాలు, మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో శనివారం ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట పోశెట్టి, ప్యాక్స్ ఛైర్మన్ అంబేకర్ సాయిరాం, తెలంగాణ ఉద్యమకారుడు కొత్తూరు శంకర్, ఎమ్ఆర్పిఎస్ సీనియర్ నాయకుడు గాడే దత్తాత్రి, ఎమ్ఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జి గాడేకర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గైక్వాడ్ గంగాధర్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక పదవిని చేపట్టడం ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.




## భూ సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

### రీసర్వే వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

జిల్లాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూముల రీసర్వే ప్రక్రియపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్.. రీసర్వే బృందాలు క్షేత్రస్థాయిలోనే ఉంటూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం సోమవారం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యటనను విజయవంతం చేయాలని, అధికారులు సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలని, ప్రొటోకాల్, భద్రతా చర్యలు పక్కాగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశాలలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, ఏఎస్పీ సాయికిరణ్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లు ఆర్థికంగా బలపడాలి

### - నాబార్డ్ పథకాల అమలుకు కృషి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**



జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) ఆర్థికంగా బలపడి రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పర్సన్ ఇన్ ఛార్జ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై పీఏసీఎస్‌ల పనితీరు, బ్యాంకింగ్ కార్యకలాపాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సహకార సంఘాల వ్యాపార వృద్ధిని పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో అమలవుతున్న పీఏసీఎస్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్, అలాగే ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యం నిల్వ పథకం అమలుకు అర్హత ఉన్న సంఘాలను గుర్తించి తగిన తోడ్పాటు అందించాలని ఆదేశించారు. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, జిల్లా సహకార అధికారి సత్యనారాయణ, డీసీసీబీ సీఈఓ ఆర్. చండి విశ్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## 30 కోట్ల బీటీ రోడ్డుపై బీజేపీ డ్రామాలు

### బోథ్ గడ్డపై ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అభివృద్ధి పథం

### బిఆర్ఎస్ నాయకుడు డుబ్బుల చంద్రశేఖర్ ధ్వజం

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 02, ప్రభాతవార్త:**

ఇచ్చోడ నుంచి డెడ్రా వరకు రూ.30 కోట్ల సీఆర్ఐఎఫ్ (కేంద్ర రోడ్డు మౌలిక వసతుల నిధి) నిధులతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ విషయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌పై బీజేపీ నాయకులు అవాకులు చవాకులు పేలడం సరికాదని, వారి తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ నాయకుడు డుబ్బుల చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే నిస్వార్థ నాయకుడు అనిల్ జాదవ్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నుల డబ్బులే కేంద్రానికి వెళ్లి తిరిగి సీఆర్ఐఎఫ్ రూపంలో నిధులుగా వస్తున్నాయని, ఇవేమీ బీజేపీ నాయకుల జేబులోనివి కావు అని స్పష్టం చేశారు. బజార్‌హత్నూర్ సొంత మండలమని చెప్పుకునే ఎంపీ గోడం నగేష్ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నప్పటికీ డెడ్రా, మాన్కాపూర్, గిర్జాయి, ఉమార్దా తదితర ఆదివాసీ గిరిజన గూడేలకు రోడ్లు ఎందుకు వేయించలేకపోయారని నిలదీశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన పదవీకాలంలోనే కొత్తపల్లి ఆదివాసీల 30 ఏళ్ల కష్టాలను తీరుస్తూ రూ.1.20 కోట్లతో మూడు వంతెనలు నిర్మించారని గుర్తుచేశారు. బజార్‌హత్నూర్ మండలంలోని భూతై (కె) తండాడెడ్రా, ఉమార్దా, గులాబ్ తండా, కొత్తపల్లి, హర్కాయ్, సోనెరావుగూడ, సాయంగూడ, మోహ్దా, గంగాపూర్ తదితర 14 మారుమూల గిరిజన ప్రాంతాలకు బిఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే భారీగా నిధులు మంజూరు చేయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో కండ్లి సర్పంచ్ రాంకిషన్, గిర్నూర్ ఉపసర్పంచ్ రాజేందర్, నాయకులు బత్తిని మురళీకృష్ణ, తరుణ్, శ్రీనివాస్, అరుణ్, నందు, సురేష్, ఎడ్ల లింగన్న, కార్తీక్, కైలాష్, మల్లేష్, వినయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.







## అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు

### ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి ఆదేశం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆమె ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, మెరుగైన సమాజ నిర్మాణానికి ఇది పునాది లాంటిదని పేర్కొన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లకు సంబంధించి స్పష్టమైన కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకునేలా స్వీప్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా, పకడ్బందీగా కొనసాగుతోందని వివరించారు. మరణించిన వారి, వలస వెళ్లిన వారి ఓట్ల తొలగింపుతో పాటు కొత్త ఓటర్ల నమోదును సక్రమంగా చేపడుతున్నామని తెలిపారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని కస్బా, నిర్మల్ గ్రామీణ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు, కలెక్టర్ సందర్శించి బీఎల్ఓలతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా, ఉట్నూర్ సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పత్తి పంటలో గంజాయి సాగు.. 51 మొక్కలు స్వాధీనం

### రూ.5.10 లక్షల విలువైన గంజాయి సీజ్.. నిందితుడి అరెస్ట్: ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్

**బజార్‌హత్నూర్, అక్టోబర్ 03, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం అరేపల్లి గ్రామ శివారులోని ఆర్ఓఎఫ్ఆర్ పట్టా వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.5.10 లక్షల విలువైన 51 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో అరేపల్లి శివారులోని చేనులో తనిఖీలు నిర్వహించగా, పారిపోతున్న సిడాం గంగారాం (60) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి ఆర్ఓఎఫ్ఆర్ భూమిలో 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరిగిన 51 గంజాయి మొక్కలను వేర్లతో సహా తొలగించి సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి అక్రమ సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు రద్దు చేయిస్తామని, సమాచారం ఉన్నవారు ఎస్పీ వాట్సాప్ నంబర్ 8712659973కి తెలుపవచ్చని వెల్లడించారు.